# 5

# పరిశుద్ధాత్మ ఎవరు?

"పరిశుద్ధాత్మ ఏది?" అనేది ప్రశ్న కాదుగాని, ఇంతకూ "పరిశుద్ధాత్మ ఎవరు?" అనేదే ప్రశ్న. ఎందుకంటే పరిశుద్ధాత్మ ఒక మనుగడ, ఒక వ్యక్తి, ఒక మూర్తిత్వం, దేవత్వం, దేవత్వంలోని మూడవ సభ్యుడు. ఆయన శక్తికంటే అధికుడు; ఆయన జీవించే పరలోకపు వ్యక్తి.

## ఆయన యొక వ్యక్తి

బైబిల్లో మనకు లభ్యమయ్యే సమాచారమంతయు పరిశుద్ధాత్మ దైవికమైన వ్యక్తియనే వాస్తవాన్ని సూచిస్తుంది. తండ్రి, కుమారులకు ఏ లక్షణాలైతే ఉన్నాయో అదే వ్యక్తిత్వపు లక్షణాలు ఆయనకు కూడా ఉన్నాయి.

### ఒక వ్యక్తి యొక్క సహజ గుణాలు ఆయనకున్నాయి

పరిశుద్ధాత్మ యొక్క సహజ గుణాలు ఆయన ఒక శక్తి అనడానికి బదులు, సజీవుడైన వ్యక్తియనియు, ప్రత్యేకమైన వ్యక్తియైయున్నాడనియు సూచిస్తున్నాయి:

1. ఆయన తీర్మానము కలవాడైయున్నాడు: "... పరిశుద్ధాత్మకును మాకును తోచెను" (అపొ. 15:28ఎ).

2. ఆయనకు మనస్సు ఉంది: "మరియు హృదయములను పరిశోధించువాడు ఆత్మయొక్క మనస్సు ఏదో యెరుగును:" (రోమా 8:27ఎ).

3. ఆయనకు చిత్తమున్నది: "అయినను వీటన్నిటిని ఆ ఆత్మ ఒకడే తన చిత్తము చొప్పున ప్రతివానికి ప్రత్యేకముగా పంచి యిచ్చుచు కార్యసిద్ధి కలుగజేయుచున్నాడు" (1 కొరింథీ. 12:11).

4. ఆయనకు జ్ఞానముంది: "ఆలాగే దేవుని సంగతులు దేవుని ఆత్మకే గాని మరి

ఎవనికిని తెలియవు" (1 కొరింథీ. 2:11బి).

5. ఆయనకు ఉద్వేగాలున్నాయి (ప్రేమ, దుఃఖము, సంతోషములనేవి): "సహోదరులారా,... మీరు నాకొరకు దేవునికి చేయు ప్రార్థనలయందు నాతో కలిసి పోరాడవలెననియు, మన ప్రభువైన యేసుక్రీస్తును బట్టియు, ఆత్మవలని ప్రేమను బట్టియు మిమ్మును బతిమాలుకొనుచున్నాను" (రోమా 15:30); "దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి; విమోచనాదినమువరకు ఆయనయందు మీరు ముద్రింపబడియున్నారు" (ఎఫెసీ. 4:30); "పరిశుద్ధాత్మవలన కలుగు ఆనందముతో గొప్ప ఉపద్రవమందు మీరు వాక్యమును నంగీకరించి, మమ్మును ప్రభువును పోలి నడుచుకొనినవారైతిరి" (1 థెస్స. 1:6).

ఈ లక్షణాలు పరిశుద్ధాత్మ కలిగియున్న వాస్తవాన్ని బట్టి ఆయన వ్యక్తియై యున్నాడని బయలుపరచబడుతుంది.

## ఆయన వ్యక్తి యొక్క చర్యలను జరిగిస్తాడు

కేవలం శక్తివలె మాత్రముకాక, పరిశుద్ధాత్మ ఒక వ్యక్తిగా తన కార్యాలను జరిగిస్తాడు. ఆయన ఈ క్రింద చెప్పబడిన వాటిని జరిగించగలడు:

1. ఆయన బోధించి జ్ఞాపకం చేయగలడు: "ఆదరణకర్త, అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ, సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" (యోహాను14:26).
2. ఆయన సాక్ష్యమిస్తాడు: "తండ్రియొద్దనుండి మీ యొద్దకు నేను పంపబోవు ఆదరణకర్త అనగా తండ్రియొద్దనుండి బయలుదేరు సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు ఆయన నన్ను గూర్చి సాక్ష్యమిచ్చును" (యోహాను 15:26).
3. ఆయన సర్వసత్యములోనికి నడిపించును: "అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడి పించును" (యోహాను 16:13ఎ).
4. ఆయన మాట్లాడును: "ఆయన తనంతటతానే యేమియు (మాట్లాడక) బోధింపక" (యోహాను 16:13బి; అపొ. 8:29; 11:12; 1 తిమోతి 4:1లను కూడా చూడు).
5. ఆయన వినును: "వేటిని వినునో వాటిని బోధించి..." (యోహాను 16:13సి).
6. ఆయన విప్పి చెప్పును: "సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును (బయలుపరచును)" (యోహాను 16:13డి).

7. ఆయన ఆటంకపరచును: "ఆసియలో వాక్యము చెప్పకూడదని పరిశుద్ధాత్మ వారినాటంకపరచినందున, వారు ఫ్రుగియ గలతీయ ప్రదేశముల ద్వారా వెళ్లిరి" (అపొ. 16:6).
8. ఆయన జీవమునిచ్చును: "... మృతులలోనుండి క్రీస్తుయేసును లేపినవాడు చావునకులోనైన మీ శరీరములను కూడ మీలో నివసించుచున్న తన ఆత్మద్వారా జీవింపజేయును" (రోమా 8:11బి).
9. ఆయన బయలుపరచును: "ఈ మర్మమిప్పుడు ఆత్మమూలముగా దేవుని పరిశుద్ధులగు అపొస్తలులకును ప్రవక్తలకును బయలుపరచబడి యున్నట్టుగా పూర్వకాలములయందు మనుష్యులకు తెలియపరచబడలేదు" (ఎఫెసీ. 3:3–5.) "మనకైతే దేవుడు వాటిని తన ఆత్మవలన బయలుపరచి యున్నాడు" (1 కొరింథీ. 2:10ఏ).
10. ఆయన పరిశోధించును: "ఆ ఆత్మ అన్నిటిని, దేవుని మర్మములను కూడ పరిశోధించుచున్నాడు" (1 కొరింథీ. 2:10బి).
11. ఆయన వాగ్దానము చేయును: "ఆత్మను గూర్చిన వాగ్దానము విశ్వాసము వలన మనకు లభించునట్లు, అబ్రాహాము పొందిన ఆశీర్వచనము క్రీస్తు యేసుద్వారా అన్యజనులకు కలుగుటకై, క్రీస్తు మనకోసము శాపమై మనలను ధర్మశాస్త్రముయొక్క శాపమునుండి విమోచించెను" (గలతీ. 3:14; అపొ. 2:33 చూడు).
12. ఆయన సహవాసము చేస్తాడు: "ప్రభువైన యేసుక్రీస్తు కృపయు దేవుని ప్రేమయు పరిశుద్ధాత్మ సహవాసమును మీకందరికిని తోడైయుండును గాక" (2 కొరింథీ. 13:14; ఫిలిప్పీ. 2:1ని కూడా చూడు).
13. ఆయన విజ్ఞాపనము చేయును: "... ఉచ్చరింప శక్యముకాని మూలుగులతో ఆ ఆత్మ తానే మన పక్షముగా విజ్ఞాపనము చేయుచున్నాడు. ... ఏలయనగా ఆయన దేవుని చిత్తప్రకారము పరిశుద్ధులకొరకు విజ్ఞాపనము చేయు చున్నాడు" (రోమా 8:26, 27).
14. ఆయన సూచిస్తాడు, రాబోవు సంగతులను తెలుపుతాడు: "తమయందున్న క్రీస్తు **ఆత్మ** క్రీస్తు విషయమైన శ్రమలనుగూర్చియు, వాటి తరువాత కలుగబోవు మహిమలను గూర్చియు ముందుగా సాక్ష్యమిచ్చునపుడు, ఆ **ఆత్మ,** యే కాలమును ఎట్టి కాలమును సూచించుచువచ్చెనో దానిని విచారించి పరిశోధించిరి" (1 పేతురు 1:11).

15. ఆయన ఆహ్వానించును: "ఆత్మయు పెండ్లి కుమార్తెయు రమ్ము అని చెప్పు చున్నారు" (ప్రకటన 22:17ఎ).
16. ఆయన నడిపించును: "యేసు పరిశుద్ధాత్మ పూర్ణుడై యొర్దాను నదినుండి తిరిగి వచ్చి, నలువది దినములు ఆత్మచేత అరణ్యములో నడిపింపబడి" (లూకా 4:1); "దేవుని **ఆత్మ**చేత ఎందరు నడిపింపబడుదురో వారందరు దేవుని కుమారులై యుందురు" (రోమా 8:14).

ఒక వ్యక్తి మాత్రమే ఈ కార్యక్రమములన్నిటిలో పాలుపొందగలడు గాని, కేవలం శక్తి వీటిని జరిగించనేరదు. ఈ విధంగా పరిశుద్ధాత్మను వ్యక్తిగా చూడవలసి యుంటుంది.

## ఆయనను అగౌరవపరచగలం

పరిశుద్ధాత్మకు చేసిన గాయాలు, చూపిన అమర్యాదలు, వర్ణించడానికి వినియోగించిన పదాలు సాధారణ వ్యక్తికి కలిగిన అమర్యాదలవంటివి. ఈ క్రింది విధాలుగా ఆయనకు అగౌరవం కలిగించగలం.

1. ఆయనను దూషించి: "... మనుష్యులుచేయు ప్రతి పాపమును దూషణయు వారికి క్షమింపబడును గాని **ఆత్మ** విషయమై దూషణకు పాపక్షమాపణ లేదు. ... పరిశుద్ధాత్మకు విరోధముగా మాటలాడువానికి ఈ యుగమందైనను రాబోవు యుగమందైనను పాపక్షమాపణలేదు" (మత్తయి 12:31, 32).
2. ఆయనతో అబద్ధములాడి: "అప్పుడు పేతురు – అననీయా,... పరిశుద్ధాత్మను మోసపుచ్చుటకు సాతాను ఎందుకు నీ హృదయమును ప్రేరేపించెను? ... దేవునితోనే అబద్ధమాడితివి" (అపొ. 5:3–4).
3. ఆయనను ఎదిరించి: "ముష్కరులారా, హృదయములను చెవులను దేవుని వాక్యమునకు లోబరచనొల్లనివారలారా, మీ పితరులవలె మీరును ఎల్లప్పుడు పరిశుద్ధాత్మాను ఎదిరించుచున్నారు" (అపొ. 7:51ఎ).
4. ఆయనను దుఃఖపరచి: "దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి; విమోచన దినమువరకు ఆయనయందు మీరు ముద్రింపబడియున్నారు" (ఎఫెసీ. 4:30).
5. ఆయనను తిరస్కరించి: "... కృపకు మూలమగు ఆత్మను తిరస్కరించినవాడు ఎంత ఎక్కువైన దండనకు పాత్రుడుగా ఎంచబడునని మీకు తోచును?" (హెబ్రీ. 10:29బి).
6. ఆయనను ఆర్పి: "ఆత్మను ఆర్పకుడి" (1 థెస్స. 5:19).

పరిశుద్ధాత్మను ఎలా అగౌరవ పరచగలమో అనే విషయాన్ని గూర్చి చేయబడిన ప్రతిపాదనలు ఆయన ఒక వ్యక్తియై యున్నాడని సూచిస్తున్నాయి. శక్తులను లేక బలమును అమర్యాదగా చూచేవాటిని సాధారణంగా ఈ రూపంలో వర్ణించడం జరుగదు, పద్య రూపంలోనో, అలంకార రూపంలోనో తప్ప ఈ లేఖన భాగాలు వర్ణించిన సందర్భాలు అలాటి భాషను సూచించవు.

## ఆయనకు ప్రత్యేకమైన ఉనికి ఉంది

పరిశుద్ధాత్మ వ్యక్తియనడానికి మరియొక సూచన ఏదంటే, వారిలాంటి స్వభావము, శీలము ఉన్నట్టు ఆయనను తండ్రితోను, కుమారునితోను ప్రస్తావించడమేగాక, ఆయనకు స్వంతమైన, వేరైన, ప్రత్యేకమైన ఉనికి ఉన్నది.

ప్రభువైన యేసు బాప్తిస్మం పొందినప్పుడు ఆయన (అంటే, పరిశుద్ధాత్మ) ప్రభువు మీదికి దిగి వచ్చినట్టు ప్రస్తావించబడ్డాడు (యోహాను 1:33). కుమారుడు బాప్తిస్మం పొంది నీటిలోనుండి ఒడ్డునకు వస్తున్నప్పుడు, ఆత్మ ఆయన మీదికి దిగివచ్చాడు; పరలోకంనుండి తండ్రి మాట్లాడాడు (మత్తయి 3:16, 17; లూకా 3:21, 22). తండ్రి పరలోకమందే నిలిచియున్నాడు, కుమారుడు భూమిమీద నిలిచియున్నాడు, ప్రభువైన యేసుతో నివసించడానికి ఆత్మ వచ్చాడు.

ఒక వ్యక్తి ప్రభువైన యేసుకు విరోధంగా మాట్లాడి క్షమింపబడవచ్చు కాని అతడు పరిశుద్ధాత్మకు వ్యతిరేకంగా మాట్లాడినట్టయితే, అతడు క్షమింపబడడు (మత్తయి 12:32). వారిద్దరు ఒకే వ్యక్తియైయుంటే, ప్రభువునకు విరోధంగా మాట్లాడి అతడు క్షమింపబడేది, పరిశుద్ధాత్మకు విరోధంగా మాట్లాడి క్షమింపబడకుండేది ఎలా జరుగుతుంది? ఈ ఉపదేశాన్ని యిచ్చేటప్పుడు, వారు వేరైన వారైయున్న సంగతి ప్రభువు గుర్తించియుంటాడు.

ఇతరులు పరిశుద్ధాత్మచే నిండినవారైయున్నట్టు చెప్పబడిన రీతినే, ప్రభువైన యేసు పరిశుద్ధాత్మ పూర్ణుడైయున్నట్టు లూకా 4:1 చెప్పుతుంది (అపొ. 6:3, 5; 7:55; 11:24). అపొస్తలుల కార్యాల సంఘటనలలో పరిశుద్ధాత్మతో నిండుకొనిన వారును పరిశుద్ధాత్మయు ఒక్కరే కాదని ప్రతివారు తప్పక ఒప్పుకుని తీరాలి. అలాగుననే ప్రభువైన యేసును పరిశుద్ధాత్మయు వేరైన ప్రత్యేకమైన వ్యక్తులని గుర్తించి తీరాలి.

"యేసు ఇంకను మహిమపరచబడలేదు గనుక ఆత్మ ఇంకను అనుగ్రహింపబడి యుండలేదు" అని యోహాను 7:39లో వ్రాశాడు. ప్రభువు తన అపొస్తలులతో యింకను భూమిమీద ఉన్నప్పుడు ఈ సంగతి చెప్పబడింది. పరిశుద్ధాత్మ యింకను యివ్వబడలేదని

అంటే, పరిశుద్ధాత్మ ప్రభువు కంటె తప్పక మరొకరైయుండి తీరాలి.

యోహాను 14:26లో అపొస్తలుల యొద్దకు "వేరొక ఆదరణకర్త"ను పంపుతానని ప్రభువు చెప్పాడు (యోహాను 14:16 ప్రకారం ఆయన పరిశుద్ధాత్మయై యుండాలి). తానే ఆ ఆదరణకర్తయైయుంటే, "వేరొక" ఆదరణకర్తను పంపుతానని ప్రభువు ఎలా చెప్పగలరు? పరిశుద్ధాత్మయు ప్రభువును ఒక్కరే అయ్యుంటే, పరిశుద్ధాత్మ వేరొక ఆదరణకర్త ఎలా అయ్యుంటాడు?

తాను వెళ్లకముందు ఆత్మను ఆయన పంపడని ప్రభువైన యేసు చెప్పారు (యోహాను 16:7). పరిశుద్ధాత్మ తనంతట తానే ఏమియు బోధింపక వేటిని వినునో వాటినే బోధిస్తాడని కూడా ఆయన చెప్పాడు (యోహాను 16:13). ప్రభువైన యేసును గూర్చియు, పరిశుద్ధాత్మను గూర్చియు క్రొత్త నిబంధన యిచ్చిన వర్తమానం ప్రకారం, వారిద్దరు స్వతంత్రులైన, వేరైన పరలోకపు వ్యక్తులని సూచిస్తుంది.

## ఆయన దైవమై యున్నాడు

తండ్రితోను, కుమారునితోను పరిశుద్ధాత్ముడు సమానమైయున్నట్టును, ఒకే అంతస్థులో ఉన్నట్టును చెప్పబడింది. జనులు తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములో బాప్తిస్మం పొందుతారు (మత్తయి 28:19). ఒకే అంతస్థు ఉన్నట్టు 2 కొరింథీ. 13:14లో పౌలు ముగ్గురుని కలిపి ప్రస్తావించాడు: "ప్రభువైన యేసు క్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీకందరికి తోడైయుండును గాక." ఆత్మసంబంధమైన కృపా వరముల (1 కొరింథీ. 12:4–6) నిచ్చువారు ఆత్మయు, దేవుడును ("తండ్రి"; 1 కొరింథీ. 8:6), మరియు ప్రభువును ("యేసు"; 1 కొరింథీ. 8:6); అవి ఆత్మ యొక్క యిష్టప్రకారం యివ్వబడుతున్నట్టు చెప్పబడింది (1 కొరింథీ. 12:11).[1]

క్రొత్త నిబంధనలోని రుజువులు తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ అనేవారు ఒకే స్వభావముగల వేరైన పరలోకపు వాసులని బహు స్పష్టంగాను, బలముగాను చూపుతున్నాయి. వారిలో ఒకరితోనొకరికున్న బాంధవ్యంలోను, మానవ జాతికి వారు పరచర్య చేసే విషయంలోను కలిసి ఏకముగానున్నారు.

దేవునికి కలిగియున్న గుణలక్షణాలే పరిశుద్ధాత్మకు ఆరోపింపబడ్డాయి. ఆయన తండ్రితోను, కుమారునితోను పంచుకొన్న అయిదు గుణగణాలను గుర్తించుము:

1. **ఆయన నిత్యుడు:** పరిశుద్ధాత్మ యొక్క నిత్యస్వభావాన్ని గూర్చి క్రింది లేఖన

భాగాలు సూచిస్తున్నాయి: (1) పరిశుద్ధాత్మ – "నిత్యుడగు ఆత్మ ద్వారా తన్ను తాను దేవునికి నిర్దోషినిగా అర్పించుకొనిన క్రీస్తుయొక్క రక్తము, నిర్జీవ క్రియలను విడిచి జీవముగల దేవుని సేవించుటకు మీ మనస్సాక్షిని ఎంతో యెక్కువగా శుద్ధి చేయును" (హెబ్రీ. 9:14). (2) తండ్రి – "పురాతన కాలమునుండి నీ సింహాసనము స్థిరమాయెను సదాకాలము ఉన్నవాడవు నీవే" (కీర్తన. 93:2). (3) యేసు – "యేసుక్రీస్తు నిన్న, నేడు, ఒక్కటే రీతిగా ఉన్నాడు; అవును యుగయుగములకు ఒక్కటే రీతిగా ఉండును" (హెబ్రీ. 13:8); "ఆలాగున మన ప్రభువును రక్షకుడునైన యేసు క్రీస్తుయొక్క నిత్యరాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అనుగ్రహింపబడును" (2 పేతురు 1:11).

2. **ఆయన సర్వము నెరిగినవాడు:** ఈ జ్ఞానము (తెలివిని)ను గూర్చి బైబిలులేఖన భాగాల్లో (1) పరిశుద్ధాత్మను గూర్చి – "మనకైతే దేవుడు వాటిని తన ఆత్మవలన బయలుపరచి యున్నాడు; ఆ ఆత్మ అన్నిటిని, దేవుని మర్మములను కూడా పరిశోధించు చున్నాడు" (1 కొరింథీ. 2:10); (2) తండ్రిని గూర్చి – "మరియు ఆయన దృష్టికి కనబడని సృష్టము ఏదియు లేదు. మనమెవనికి లెక్క యొప్పచెప్పవలసియున్నదో ఆ దేవుని కన్నులకు సమస్తమును మరుగులేక తేటగా ఉన్నది" (హెబ్రీ. 4:13); మరియు (3) ప్రభువైన యేసునుగూర్చి – "అయితే యేసు అందరిని ఎరిగినవాడు గనుక ఆయన తన్ను వారి వశము చేసికొనలేదు. ఆయన మనుష్యుని ఆంతర్యమును ఎరిగినవాడు గనుక ఎవడును మనుష్యుని గూర్చి ఆయనకు సాక్ష్యమియ్య నక్కర లేదు" అని వ్రాయబడింది (యోహాను 2:24, 25).

3. **ఆయన సర్వశక్తిగలవాడు:** ఈ శక్తి ప్రతిదాని మీద ఉన్నట్టు బైబిలు లేఖన భాగాలలో (1) పరిశుద్ధాత్మనుగూర్చి – "పరిశుద్ధాత్మ నీమీదికి వచ్చును; సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును" (లూకా 1:35బి). "అప్పుడు యేసు, ఆత్మ బలముతో గలిలయకు తిరిగి వెళ్లెను" (లూకా 4:14ఎ); "అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందుదురు" (అపొ. 1:8ఎ); (2) దేవుని గూర్చి – "దేవుడు చెప్పిన యేమాటయైనను నిరర్థకము కానేరదు" (లూకా 1:37); మరియు (3) ప్రభువైన యేసును గూర్చి–"పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్య బడియున్నది" (మత్తయి 28:18) అని చెప్పబడియుంది.

4. **ఆయన అన్ని చోట్ల ఉన్నవాడు:** అన్ని చోట్ల ఉండగల సామర్థ్యము (1) పరిశుద్ధాత్మకు ఉంది – "నీ ఆత్మయొద్దనుండి నెనెక్కడికి పోవుదును?" (కీర్తన. 139.7ఎ); (2) తండ్రికి ఉంది – (నిజముగా దేవుడు ఈ లోకమందు నివాసము చేయునా?) "నిశ్చయముగా దేవుడు ఈ లోకమందు నివాసము చేయడు; ఆకాశమహా కాశములు

సహితము నిన్ను పట్టజాలవు" (1 రాజులు 8:27ఎ). "నాకు కనబడకుండ రహస్య స్థలములలో దాగగలవాడెవడైనకలడా? నేను భూమ్యాకాశముల యందంతట నున్నవాడను కానా?" (యిర్మీయా 23:24); (3) ప్రభువైన యేసుకు ఉంది – "ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడా ఉన్నానని" (మత్తయి 28:20బి) వారితో చెప్పెను.

5. **ఆయనకు సృష్టించగల శక్తి ఉంది:** దేవత్వములోని ప్రతి (సభ్యుడు) వ్యక్తి సృష్టికర్తయై యున్నట్టు లేఖనాలు చిత్రిస్తున్నాయి: (1) పరిశుద్ధాత్మ – "దేవుని ఆత్మ జలములపైన అల్లాడుచుండెను" (ఆది. 1:2); (2) తండ్రియైన దేవుడు – "తన బలముచేత భూమిని సృష్టించెను, తన జ్ఞానముచేత ప్రపంచమును స్థాపించెను; తన ప్రజచేత ఆకాశమును విశాలపరచెను" (యిర్మీయా 51:15); మరియు (3) కుమారుడు – "ఆకాశమందున్నవియు భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవి గాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను" (కొలస్సీ. 1:16).

## ముగింపు

దేవునికే వర్తించే మాటలచేత పరిశుద్ధాత్మ వర్ణింపబడ్డాడు. ఈ మాటలనుబట్టి తండ్రితోను కుమారునితోను పరిశుద్ధాత్మ దైవ స్వభావాన్ని పంచుకుంటాడని, తండ్రితోను కుమారునితోను ఏకమైయుంటాడని, అయినా ఆయన వేరైన వ్యక్తియైయున్నాడని తీర్మానానికి రావచ్చు. ఆయన బైబిల్లో ఒక ప్రధానమైన, ముఖ్యమైన వ్యక్తియైయున్నాడు.

## పరిశీలనకైన ప్రశ్నలు

(*జవాబులు – 249వ పేజీలో కన్పిస్తాయి*)

1. "పరిశుద్ధాత్మ ఏది?" అనేదానికి బదులు "పరిశుద్ధాత్మ ఎవరు?" అని ప్రశ్న ఎందుకుండాలో వివరించు?
2. పరిశుద్ధాత్మ సజీవమైన "వ్యక్తి" అని సూచించే అయిదు గుణలక్షణాలు ఏవి?
3. పరిశుద్ధాత్మను అమర్యాదగా చూడవచ్చు అనేది ఆయన వ్యక్తియనే వాస్తవాన్ని ఎలా సూచిస్తుంది?
4. తండ్రితోను, కుమారునితోను పరిశుద్ధాత్మ ఏ లక్షణాలను పంచుకుంటున్నాడు?

## పద సహాయకారి

**గుణగణాలు –** స్వభావ లక్షణాలు లేక విశేష లక్షణాలు రోమా 1:20 యిలా అంటుంది, "ఆయన అదృశ్యలక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృజింపబడిన వస్తువులను ఆలోచించుటవలన తేటపడుచున్నవి గనుక వారు నిరుత్తరులైయున్నారు."

**అద్భుత వరములు** – దేవుడు ప్రసాదించిన ప్రత్యేకమైన సామర్థ్యములు – బాషలు మాట్లాడడం, స్వస్థపరచడం, ప్రవచించడం లాంటివి – క్రొత్త నిబంధన పూర్తిగా వ్రాయబడకముందు ఆది సంఘానికి యివి యివ్వబడ్డాయి. ఈ వరములు నేడు లభ్యంకావు, అవసరతకూడా లేదు (ఎఫెసీ. 4:5; మత్తయి 28:18–20).

## నేడు క్రైస్తవులలో పరిశుద్ధాత్మ యొక్క పని

1. పాప మరణముల నియమమునుండి ఆయన మనలను విడిపిస్తాడు (రోమా 8:2–8).
2. ఆయన మనలను (మృతులలోనుండి) లేపును (రోమా 8:11).
3. ఆయన మన ప్రార్థనలలో సహాయము చేస్తాడు (రోమా 8:26; ఎఫెసీ. 6:18).
4. మన పక్షంగా ఆయన విజ్ఞాపన చేస్తాడు (రోమా 8:26, 27).
5. ఆయన మనలను నడిపిస్తాడు (రోమా 8:14).
6. విమోచన దినమువరకు సంచకరువుగా ఆయన మనకు ముద్ర వేస్తాడు (2 కొరింథీ. 1:22; ఎఫెసీ. 1:13, 14; 4:30).
7. ఆయన మనతో సహవాసము చేస్తాడు (2 కొరింథీ. 13:14).
8. తండ్రి సన్నిధికి చేరగలగడానికి ఆయన మనకు అవకాశమిస్తాడు (ఎఫెసీ. 2:18).
9. అంతరంగ పురుషుని ఆయన బలపరచుతాడు (ఎఫెసీ. 3:16).
10. ఆయన ఏకత్వాన్ని తెస్తాడు (ఎఫెసీ. 4:3).
11. ఆయన మనలను పరిశుద్ధపరచువాడు (2 థెస్స. 2:13).

---

[1]అద్భుత వరములు నేడు నిలిచిపోయాయి. 1 కొరింథీ. 13:8–13లో చెప్పబడిన దానిని బట్టి దీనిని మనం రూఢీగా నమ్మవచ్చు. 1 కొరింథీలోని మూడు అధ్యాయాలలో అద్భుత వరములను

గూర్చిన చర్చ మనం కనుగొంటాం (12–14). ఈ చర్చ మధ్యలో, అద్భుతమైన ఏ వరముకంటెను ప్రేమ శ్రేష్ఠమైనదని ప్రకటింపబడింది (13:1–3). అటు పిమ్మట అతడు ప్రేమను వర్ణించాడు (13:4–7). ఆ ఆధ్యాయంలోని చివరి భాగంలో (13:8–13), ప్రేమ అతి శ్రేష్ఠమైనది. అద్భుత వరములను దాటి నిలిచియుంటుందని చూపబడింది. "ప్రవచనములైనను నిరర్థకములగును; భాషలైనను నిలిచిపోవును; జ్ఞానమైనను నిరర్థక మగును" అని పౌలు అన్నాడు. ఈ వరాలనుబట్టి, "మనము కొంతమట్టుకు ఎరుగుదుము, కొంతమట్టుకు ప్రవచించుచున్నాము గాని పూర్ణమైనది వచ్చినప్పుడు పూర్ణముకానిది నిరర్థకమగును" అని పౌలు అంటున్నాడు (9, 10 వచనాలు). పరిపూర్ణమైనది వచ్చినప్పుడు ఈ అద్భుత వరములు నిలిచిపోవలసి యుంటుంది.

"పరిపూర్ణమైనది" అంటే, "సంపూర్ణమైనదని భావం గనుక" "పూర్ణముకానిది" అనే దానికి భిన్నంగా ఉంది. అద్భుతమైన జ్ఞానము, ప్రవచనములు, దేవుని వాక్యాన్ని నోటిద్వారా బయలుపరచినది పూర్ణము కానిదని భావం. గనుక, "పూర్ణమైనది" వ్రాత రూపంలో పూర్తిగా బయలుపరచబడినది క్రొత్త నిబంధన అని గుర్తించడం బహు సహజం. దేవుని చిత్తము యొక్క సంపూర్ణ ప్రత్యక్షత వ్రాత రూపంగా మనుష్యునికి క్రొత్త నిబంధనగా యివ్వబడింది. దేవుని చిత్తము యొక్క సంపూర్ణ ప్రత్యక్షత, "పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన విశ్వాసము" (యూదా 3), మొదటి శతాబ్దము ముగియు ప్రాంతంలో సాధారణ స్వాధీనంలోనికి వచ్చింది. పూర్ణమైనది వచ్చినప్పుడు పూర్ణముకానిది నిరర్థకము చేయబడింది. క్రొత్త నిబంధన లేఖనాలు సంపూర్ణమైన దేవుని చిత్తమైనందున (2 తిమోతి 3:16, 17; 2 పేతురు 1:3), ప్రత్యక్షతను కొనసాగించుటకు అద్భుతవరములు అవసరమైయుండవు. (ఫిల్ శాండర్, "నేడు అద్భుతవరాలు ఎవనికైనా ఉన్నాయా?" ట్రూత్ ఫర్ టుడే, [ఎప్రిల్ 1995 ఆంగ్ల ప్రతిని చూడు]: 49.)